క్లుప్తంగా

విద్యార్థులు ఐటీ రంగంలో రాణించాలి



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి

ఆదోనిరూరల్: ఆదోని–ఆలూరు రహదారిలోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, నెట్‌వర్క్ ప్రోగ్రాం ల్యాబ్‌ను శుక్రవారం టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. విద్యార్థులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం ఐటీ రంగంలో విప్ల వాత్మక మార్పులు వచ్చాయని, ప్రతిఒక్కరూ మంచి నైపుణ్యాలను సంపాదించుకుని ఐటీ రంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. కళాశాల సెక్రటరీ పీఎస్ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ జీఎస్ సురేంద్ర బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఆదోని సెంట్రల్: జిల్లా స్థాయిలో జరిగే అండర్–17 వాలీబాల్ పోటీలకు మిల్టన్ పాఠశాల విద్యార్థి జి.మధు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత నెలలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీలలో మధు అత్యుత్తమ ప్రతిభ కనబరచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ బి.నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు బి.వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమం



నిజాముద్దీన్ కాలనీలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోనిటౌన్: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్ కుమార్‌రెడ్డి తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 40వ వార్డు నిజాముద్దీన్ కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇస్తూ ముందుకు సాగారు. కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్, పట్టణాధ్యక్షుడు దేవా, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ,కౌన్సిలర్లు సురేష్,ఇక్బాల్, చలపతి, చిన్నా, రాజేశ్వరరెడ్డి, సందీప్‌రెడ్డి, రామలింగేశ్వరయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ



డీఎస్పీ శివనారాయణస్వామి చేతులమీదుగా హోమియో మందులను అందజేస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్: డెంగ్యూ ఫీవర్, మలేరియాకు సంబంధించి శుక్రవారం స్నేహ హోమియో క్లీనిక్‌లో డీఎస్పీ శివనారాయణ స్వామి చేతుల మీదుగా రోగులకు హోమియో మందులను పంపిణీ చేశారు. స్నేహ హోమియో క్లినిక్ ఏర్పాటు చేసి 30వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా 300 మందికి ఉచితంగా హోమియో మందులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు ఉచితంగా హోమియో మందులను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యం పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వాహనాల వేలంలో రూ.4.90 లక్షల ఆదాయం

ఎమ్మిగనూరురూరల్: సబ్ డివిజన్ పరిధిలో అక్రమ మద్యం తరలింపులో పట్టుబడిన వాహనాలను శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం ఆవరణలో డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలోని ఎమ్మిగనూరు టౌన్, రూరల్, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, మాధవరం, కౌతాళం, పెద్దకడబూరు, కోసిగి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 2020–2021 సంవత్సరంలో 55 వాహనాలు పట్టుబడినట్లు చెప్పారు. వీటిని వేలం వేయగా 44 వాహనాలను పలువురు వ్యక్తులు కొనుగోలు చేశారని, రూ.4.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత వేలంలో అమ్ముడుపోని వాహనాలను మరోసారి వేలం వేస్తామని చెప్పారు. టౌన్, కోసిగి సీఐలు మధుసూదన్ రావు, ఏరిషావలి, ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, మహేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా నవరత్నాల వెలుగులు



హోళ్వి గ్రామంలో ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



హాజరైన జనం

కౌతాళం: పేదల ఇళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ వెలుగులు నింపారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఉద్ఘాటించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్ రెడ్డితో కలిసి మండలంలోని హోళ్వి గ్రామంలో నాల్గవ రోజుగా శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిచిన పథకాలను గ్రామస్తులకు వివరించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుని అధికారులతో పరిష్కార మార్గాలు చూపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసం జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం తరపున ఏదో ఒక పథకం ఇంటికి చేరిందన్నారు. పేదల కోసం శ్రమిస్తూనే ప్రగతికి బాటలు వేస్తున్నారన్నారు. గ్రామాల్లో డ్రెయినేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలే తమను మళ్లీ అధికారంలోకి తెస్తాయని, ప్రజలంతా జగనన్న పాలనకు ఆకర్షితులయ్యారని తెలిపారు. చేసిన మోసాల వల్లే మాజీ సీఎం చంద్రబాబునాయుడు నేడు జైల్లో ఉన్నారని, ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితి ఏ కోశాన లేదన్నారు. గ్రామంలో మొత్తం 250 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాల అందిన తీరు తెలుసుకున్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. ఈచనహాల్ నర్సమ్మ ఇటీవల తన కొడుకు మృతి చెందడంతో అనాథగా మారానని దీనస్థితిని వివరించడంతో ఆమెకు రూ.3 వేల నగదును అందజేసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ అమరేష్, జెడ్పీటీసీ రాధప్రియదర్శిని, సర్పంచ్ క్రాంతి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, స్థానిక నేతలు బసవధని, చెన్నప్ప, సిద్ధనగౌడ్, ఏకాంబర్ రెడ్డి, రామన్నగౌడ్, మహబుబ్‌సాబ్, ఎంపీడీఓ సుబ్బారాజు, వివిధ శాఖల అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

అంటరానితనంపై కేవీపీఎస్ నిరంతర పోరాటం

కౌతాళం: దళితులపై దాడులు, అంటరానితనంపై కేవీపీఎస్ నిరంతర పోరాటాలు చేస్తోందని ఆ సమితి జిల్లా సహాయ కార్యదర్శి చిన్న మారయ్య అన్నారు. కేవీపీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని బంటకుంట, గుడికంబాలి, సుళేకేరి గ్రామాల్లో కేవీపీఎస్ జెండాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అలాగే అంటరానితనంపై నిరంతరం రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక, ఆర్థిక రాజకీయ సమానత్వం కోసం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న కుల నిర్మూలనే అంతిమ లక్ష్యంగా కేవీపీఎస్ పోరాటం నిర్వహించబోతుందన్నారు. ఈ సామాజిక ఉద్యమానికి ప్రజలందరూ సహకారం అందించాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు బసవ, నాగేంద్ర, వసంత, కిష్టప్ప, ఈరన్న, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వ భరోసా





సాధాపురంలో కేస్ షీట్‌ను అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య, దుద్ది గ్రామంలో మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్‌కుమార్

ఆదోనిరూరల్: మండలంలోని సాధాపురం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కర్నూలు డీఎం అండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, చికిత్సలు, మందులను పరిశీ లించారు. రోగులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక జబ్బులకు మందులను అందజేసి, చికిత్సలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు ఇబ్రహీం, సుస్మిత, శాంతి, పవన్, స్రవంతి, సురేష్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీకృష్ణ, గోనభావి సర్పంచ్ మహ్మద్ ఆలీ, డీటీ రజనీకాంత్‌రెడ్డి, ఈఓఆర్డీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామ సచివాలయం పరిధిలోని దుద్ది, కొల్మాన్‌పేట గ్రామ ప్రజలకు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.



దుద్ది గ్రామ వైద్య శిబిరంలో మందులను అందజేస్తున్న దృశ్యం

దుద్ది ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్ కుమార్ సమక్షంలో వైద్య సిబ్బంది ప్రజలకు సేవలందించారు. కొల్మాన్‌పేట గ్రామ సర్పంచ్ గులిగేని జయరాం, దుద్ది గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, రామలింగ శిబిరాన్ని ప్రారంభించారు. ఆ సచివాలయం పరిధిలో ఓపీ ద్వారా 356 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రధానంగా రక్త పరీక్ష, డయాబెటీస్, మలేరియా, హెబీ, బీపీ, షుగర్, రక్తపరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ కింద కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే ఉచిత కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారులు నజీర్ అహ్మద్, రజిత, గైనికాలజిస్ట్ మౌనిక, చిన్న పిల్లల డాక్టర్ సమిఉల్లా, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, పంచాయతీ కార్యదర్శి పరశురాం తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మండలంలోని కాచాపురం సచివాలయం–2 పరిధిలో ఖగ్గల్ గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. గ్రామ ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంపులో స్పెషలిస్ట్ డాక్టర్లు ప్రజలకు వైద్య చికిత్సలు అందించారు. వైద్యులు భావన, వసంత రోగులకు పరీక్షించి మందులు సరఫరా చేశారు. శిబిరంలో 50 మందికి పైగా చికిత్స పొందారు.

చంద్రబాబు బాగోతం ప్రజలందరికీ తెలుసు



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

- దత్తపుత్రుడు పవన్ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు.
- నిలకడలేని పార్టీలు నిలబడవ్
- నెట్టేకల్ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: మాజీ సీఎం చంద్రబాబునాయుడు చేసిన పాపాలకు శిక్ష అనుభవించాల్సిందేనని, ఆయన చేసిన పాపాలు, అవినీతి ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. దత్త పుత్రుడు పవన్‌కళ్యాణ్‌కు రాజకీయ నిలకడ లేదని ఒక్కోరోజు ఒక్కో పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నారని యద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో మండలంలోని నెట్టేకల్ గ్రామంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. 200కు పైగా ఇళ్లను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తమ పర్యటనలకు ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన, ప్రజల గుండెల్లో సీఎం జగన్ స్థానాన్ని బయటపెడుతోందని ఎమ్మెల్యే చెప్పారు. నాలుగు సంవత్సరాల పరిపాలనలో వైఎస్ జగన్ మేనిఫెస్టోలో ప్రకటించిన 98 శాతం హామీలను నెరవేర్చారని వివరించారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనపై ప్రజలందరూ సంతృప్తికరంగా ఉన్నారన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టై జైలులో ఉన్నారని, అవినీతికి పాల్పడిన నారా లోకేష్, ఇతర మాజీ మంత్రులు త్వరలోనే జైలుకు పోవడం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ కనుమరుగు అవుతుందని, నిలకడ లేని జనసేన నిలబడలేదన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, పీఆర్ఏఈ మాలిక్‌బాషా, తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగేశ్వరయాదవ్, గురునాథ్‌రెడ్డి, రామాంజనేయులు, చిన్నగొట్టయ్య, లక్ష్మి నారాయణ, సంజీవరెడ్డి, రామ్‌సింగ్, మల్లికార్జున, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని కలిసిన న్యాయవాదులు

రాయలసీమ జోన్ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ ఎం.ప్రభాకర్, కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ పి.సువర్ణరెడ్డి, ఆదోని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సురేందర్ శుక్రవారం ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నెట్టేకల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీను వారితో పాటు ఆదోని న్యాయవాదులు పి.మధుసూదన్‌రెడ్డి, ఎల్.కె.జీవన్‌సింగ్, అర్జున్, ఏజీపీ ఎస్.అంజనప్ప, ఆనంద్, తరుణ ప్రసాద్, నవీన్‌రెడ్డి తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక సాయం, న్యాయవాదుల సంక్షేమ హామీలను నెరవేర్చడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

పెద్దకడబూరు: గ్రామాలలో ఎవరైనా సమస్యలు సృష్టిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కొవాల్సి వస్తుందని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. సమస్యాత్మక వ్యక్తుల ఇళ్లను సోదా చేశారు. 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. రికార్డులు సరిగా లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం సమస్యాత్మక వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. పచ్చని పల్లెల్లో చిచ్చు పెట్టి గొడవలు సృష్టిస్తే సహించేదే లేదన్నారు. చిన్న చిన్న వాటికే పెద్ద పెద్ద గొడవలు చేస్తున్నారని ఇకపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గ్రామంలో అధికంగా నాటుసారా తయారు చేస్తున్నారని ఇప్పటికైనా మానుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు తెరదించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సమీపంలోని కొండల్లో నాటుసారా కాస్తున్నారన్న సమాచారంతో సోదాలు నిర్వహించి బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కోసిగి సీఐ ఏరిషావలి, మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, పెద్దకడబూరు ఎస్ఐ మహేష్‌కుమార్, కౌతాళం ఎస్ఐ నరేంద్రరెడ్డి, మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్ రాజు, మాధవరం ఎస్ఐ కిరణ్‌కుమార్, ఎమ్మిగనూరు టౌన్ ఎస్ఐలు రమేష్ కుమార్, మస్తాన్‌వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఉపేంద్ర (ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన నాడుగేని చిన్న ఈరయ్య, తిమ్మక్కల కుమారుడు ఉపేంద్ర (28) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఉపేంద్ర గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా మద్యం తాగుతూ ఉండేవాడు. ఈ స్థితిలో శుక్రవారం సాయంత్రం మద్యం తాగి ఇంట్లో తలుపు వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి చూడగా ఉపేంద్ర ఫ్యాన్‌కు వేలాడుతూ నిర్జీవంగా కనిపించాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడికి భార్య మీనాక్షి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జలాల పంపిణీ సమతూకంగా ఉండాలి



మాట్లాడుతున్న నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు సాయిబాబా

ఆదోనిరూరల్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో చేపట్టిన కృష్ణ జలాల పంపిణీ సమతూకంగా జరపాలని ఏఎడీఏ కన్వీనర్ ఆదినారాయణ, నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు సాయిబాబా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్‌సీసీ కార్యాలయంలో ఏఎడీఏ కన్వీనర్ ఆదినారాయణ అధ్యక్షతన ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. కరువు, నీటిఎద్దడితో రాయలసీమ ప్రాంతం ఏడారిగా మరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టి మరోవైపు నీటి పంపిణీ అంటూ కేంద్రం ఆడుతున్న డ్రామాలకు తెరదించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆర్‌సీసీ అధికార ప్రతినిధి ఎల్లార్తి అర్జున్ మాట్లాడారు. ఏఎడీఏ కన్వీనర్ ఆదినారాయణ మాట్లాడుతూ బాపురం దగ్గర 650 క్యూసెక్కుల నీరు ఎల్లెల్సీలో రావాల్సి ఉండగా ఎప్పుడూ 350 క్యూసెక్కులు దాటడం లేదని, ఇక్కడి పరిస్థితులు ఇలా ఉంటే కేంద్రం ఏకపక్షంగా వ్యవమరించడం మంచిది కాదన్నారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగన్న, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, ఆర్‌సీసీ నాయకులు రాజ్‌కుమార్, ఈరన్న, బసవరాజ్, నాగరాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో అపహరణ



అపహరణకు గురైన ఆటోతో యజమాని శివ (ఫైల్)

కోసిగి: స్థానిక సంతమార్కెట్‌లోని ఉరుకుంద లైన్లో గురువారం రాత్రి పార్కింగ్ చేసిన బజాజ్ ఆటోను దొంగలు అపహరించుకుపోయారని యజమాని పిరమాల శివ వాపోయారు. ఘటనపై శనివారం కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శివ కోసిగి – ఉరుకుంద మార్గంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆ మార్గంలో రోజుకు 50 ఆటోల వరకు వెళుతుంటాయి. దీంతో ఒక రోజు ముందుగానే ఆటోను లైన్‌లో ఉంచాల్సి వస్తోంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటో నడిపారు. తర్వాత లైన్ కోసం రాత్రి ఆటోను పార్కింగ్ చేసి ఉంచారు. తెల్లవారుజామున 5 గంటలకు వెళ్లి చూడగా ఆటో కనిపించలేదు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా కోసిగిలో వరుస దొంగతనాలు పెరిగి పోతున్నాయి. ఇటీవల పలు ఇళ్లల్లో చోరీలు జరిగాయి. అలాగే సైకిళ్లు, బైక్‌లు అపహరణకు గురయ్యాయి. త్రీవీలర్ ఆటో అపహరించడం ఇదే మొదటిసారిగా అనిపిస్తోంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి దొంగతనాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్ఐఏ దాడులను అరికట్టండి

కౌతాళం: కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఏ పేరిట చేయిస్తున్న దాడులను వెంటనే ఆపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు వెంకప్ప, రైతు కూలీ సంఘం మండలఅధ్యక్ష కార్యదర్శి జగదీష్, నాగేంద్రప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతును అణిచివేయడానికి ప్రజాస్వామిక వాదులు, రచయితలు, కళాకారులు, న్యాయవాదుల ఇళ్లపై దాడులు చేసి అక్రమ అరెస్టులు చేయడం వెంటనే ఆపాలన్నారు. ప్రజాల పక్షాన నిలబడి పోరాడితే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. రైతులు ప్రతి ఎడాది నష్టపోతూనే ఉన్నారని కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండు చేశారు. ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. నాయకులు ఖాదర్‌బాష, రమేష్, బాష తదితరులు పాల్గొన్నారు.

నేటి సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్ఎం, ఆశా వర్కర్లు

ఆదోని సెంట్రల్: ప్రతి కుటుంబంలోని వ్యక్తులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటా తిరిగి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి వైద్య శిబిరాలకు వచ్చి డాక్టర్ల వద్ద మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో జరిగే వైద్య శిబిరాల వివరాలను అధికారులు వెల్లడించారు.

మండలం	గ్రామం	వైద్య శిబిర ప్రాంతం	డాక్టర్
ఆదోని	హనావాళు	గ్రామ సచివాలయం	జి.దివ్య
కోసిగి	పల్లిపాడు	ప్రాథమిక పాఠశాల	ఎస్.నజీర్‌అహ్మద్
కౌతాళం	కామవరం	గ్రామ సచివాలయం	షేక్ ఆయేషా జోబియా
మంత్రాలయం	సుగూరు	గ్రామ సచివాలయం	వై.గోవిందమ్మ
ఆదోని పట్టణం	హవ్వన్నపేట	అర్బన్ హెల్త్ సెంటర్	షేక్ షాజిద్

పంట నమోదు చేసుకోండి

కౌతాళం: పంట నమోదును రైతులు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి సూచించారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇంకా కొంత మంది రైతులు పంట నమోదు చేసుకోలేదన్నారు. ఈ నెల 8వ తేదీలోపు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి పంట నమోదు పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే క్రాప్ బుకింగ్‌తో పాటు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. క్రాప్ బుకింగ్‌తో పాటు ఈ–కేవైసీ చేయించుకుంటే పంటనష్ట పరిహారంతో పాటు ఇన్సూరెన్స్, సబ్సిడీ ఎరువులు, బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు

పెద్దకడబూరు: మండలానికి జేజీ–11 రకానికి చెందిన 30 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏఓ ఎం.వరప్రసాద్ పేర్కొన్నారు. క్వింటా విత్తన ధర సబ్సిడీ పోనూ రైతులు రూ.4,860 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాయితీ శనగ విత్తనాలు కావాల్సిన వారు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. దీంతో పాటు ఈ పంట నమోదు, ఈ–కేవైసీ నమోదు చేయటానికి ఈ నెల 9వ తేదీ వరకు సమయం ఉందన్నారు. రైతులు పంట నమోదు వివరాలను సరిచూసుకోవాలన్నారు. అలాగే అర్హత కలిగిన కౌలు రైతులు రుణాల కోసం చిన్నతుంబళం, పెద్దకడబూరు సొసైటీ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

కౌతాళం: వైఎస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన ఉసేనమ్మ గత నెల 30వ తేదీన మృతి చెందింది. మృతురాలికి వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో తక్షణ సహాయం కింద శుక్రవారం రూ.10 వేలను నామినీగా ఉన్న కుమారుడు సాలే శ్రీరాములకు అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమఅవుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు, సర్వేయర్ సరస్వతి ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



నవీన్‌కుమార్

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నవీన్‌కుమార్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 2వ తేదిన కర్నూలులో జరిగిన జిల్లా సెలక్షన్ పోటీలలో నవీన్ కుమార్ ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 7వ తేదిన వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లా అభివృద్ధిపై చర్చ



మంత్రి గుమ్మనూరు జయరాంతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

ఆలూరు: జిల్లా సమగ్రాభివృద్ధి, పాలనపై శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన చర్చించారు. శుక్రవారం మంత్రిని ఆయన నివాసంలో కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కుటుంబసభ్యులు కలెక్టర్‌ను సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రితో ఇంటింటికీ తాగునీరు, ప్రాజెక్టులు, రోడ్లు, జగనన్న గృహాలు, ఎల్లెల్సీ, హెచ్ఎల్సీ, వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు. రోడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం, రిజర్వాయర్ల పనులు, కళాశాలల మంజూరు, శాశ్వత భవనాలు వంటివి పూర్తయితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. అలాగే గ్రామాల్లో ఇళ్లు లేని వారిని స్థలాలను మంజూరు చేయాలని మంత్రి కలెక్టర్‌ను కోరారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టండి



రీసర్వే వివరాలను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తహసీల్దార్ కార్యాలయంలో భూసర్వే పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ఎలాంటి తప్పులకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దులను చూయించాలని చెప్పారు. అనంతరం భూ సర్వే రికార్డుల గదిని పరిశీలించారు. సబ్ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ ఆంజనేయులు, రీసర్వే డీటీ జోతిర్మయి, వీఆర్వో షేక్షావలి, ఇన్‌చార్జ్ సర్వేయర్ వాహిద్ తదితరులు ఉన్నారు.

హాలహర్వి పీహెచ్‌సీ తనిఖీ

హాలహర్వి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యుల హాజరు రికార్డులు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వైద్యం అందించాలని, మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. డాక్టర్లు ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.